సాక్షి
అనకాపల్లి
సోమవారం, 23, జూన్, 2025



హరే కృష్ణ, హరే రామ

ఇస్కాన్ మందిరం ఆదివారం వారాంతపు పూజల్లో 'హరే కృష్ణ, హరే రామ' నామస్మరణతో మార్మోగింది.

8లో

ఉష్ణోగ్రతలు

ఆదివారం

	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	33.5/27.4
చోడవరం	35.0/24.0



అప్పన్నకు ఆర్జిత సేవలు

ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.

8లో

పిడికిలి బిగిద్దాం..



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ సమన్వయకర్తలు మలసాల భరత్‌కుమార్, అదీప్‌రాజు, తదితర పార్టీ నాయకులు

- యువత పక్షాన పోరు బాట
- నేడు కలెక్టరేట్ వద్ద నిరసన
- మాట తప్పిన కూటమి సర్కారును నిలదీద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ పిలుపు
- 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి: యువతకు కూటమి సర్కారు తీరని అన్యాయం చేస్తోందని, వైఎస్సార్‌సీపీ వారి తరఫున పోరాడుతుందని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ యువజన విభాగం నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'యువత పోరు' పోస్టర్‌ను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నపురెడ్డి అదీప్‌రాజులతో కలిసి అమర్‌నాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, లేని పక్షంలో నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేల భృతి చెల్లిస్తామని ఇచ్చిన వాగ్దానం.. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా అమలు కాలేదన్నారు. నిరుద్యోగుల పక్షాన 'యువత పోరు' సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు.

పార్టీలో యువతకు ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలో యువతకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, కీలక బాధ్యతలు వారికే అప్పగిస్తున్నారని అమర్‌నాథ్ చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నందున ప్రజల తరపున పోరాడి మంచి గుర్తింపు తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. 40 సంవత్సరాల అనుభవం గల చంద్రబాబు పాలనను.. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనను ప్రజలు సరిపోల్చి చూస్తున్నారని, 2027లో జమిలి ఎన్నికలు వస్తే అత్యధిక మెజార్టీతో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

యువజన విభాగం నేతలకు సత్కారం

అనంతరం యువజన విభాగంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నియోజకవర్గ అధ్యక్షుడు జాజుల రమేష్, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు వేగి త్రినాథ్, అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు బాధపు హరికృష్ణ, నీటిపల్లి దివాకర్‌లను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్‌లు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, కశింకోట ఎంపీపీ కలగ లక్ష్మిగున్నయ్యనాయుడు, అనకాపల్లి, కశింకోట మండలాల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ కొణతాల మురళీకృష్ణ, 80, 84 వార్డు ఇన్‌చార్జ్‌లు కోరుకొండ రాఘవ, కె.ఎం.నాయుడు, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయి కిరణ్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లిలో నిరుద్యోగులతో భారీ ర్యాలీ

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న 'యువత పోరు' నిరసన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి సోమవారం ఉదయం 9.30 గంటలకు ర్యాలీ బయలుదేరుతుందని, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు.



జాబు లేదు.. భృతి రాదు..

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

కంపెనీలు తెస్తామన్నారు.. రాష్ట్రంలో కొత్తగా 20 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు.. ఉపాధి కల్పించలేకపోతే ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల భృతి ఇస్తామన్నారు.. ఇవన్నీ కూటమి పార్టీలు ఎన్నికల ముందు చెప్పిన మాటలు. ఏరు దాటాక బోడి మల్లన్న.. అన్నట్టు అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఉద్యోగాల ఊసే లేదు. యువత పక్షాన ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిపై ఉద్యమించేందుకు వైఎస్సార్‌సీపీ నడుం బిగించింది.

సాక్షి, అనకాపల్లి: మేనిఫెస్టో అన్నా.. అందులో చేసిన వాగ్దానాలన్నా కూటమి ప్రభుత్వానికి ఖాతరు లేదు. ఇంటికో ఉద్యోగమిస్తామని ఆశపెట్టి కనీసం ఆ దిశగా ప్రయత్నాలు కూడా ప్రారంభించలేదు. జనవరి 1న జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పారు. ఆ మాట కూడా నిలుపుకోలేదు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 2,30,000 మంది నిరుద్యోగులున్నారు. రాను రాను ఆ సంఖ్య పెరుగుతోందే గానీ తగ్గడం లేదు. రూ.3 వేల చొప్పున వారికి నెలకు రూ.69 కోట్ల నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ఏడాదికి యువతకు ప్రభుత్వం బాకీ పడిన మొత్తం రూ.828 కోట్లు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం పరుగులు పెట్టింది. 2019–24 కాలంలో 35 భారీ పరిశ్రమలు, 11,343 ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు చేశారు. రూ.4483.71 కోట్ల పెట్టుబడి పెట్టారు. వీటి ద్వారా 85,785 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ ఏడాది కాలంలో కొత్తగా ఒప్పందం జరిగిన పరిశ్రమ ఒక్కటి లేదు. ఇక ఉద్యోగాలకు ఆస్కారం ఎక్కడ. అయినప్పటికీ సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంతో ఉద్యోగార్థులు కోపంతో రగిలిపోతున్నారు. ప్రభుత్వంలో చైతన్యం తీసుకురావడానికి వైఎస్సార్‌సీపీ సోమవారం 'యువత పోరు'కు పిలుపునిచ్చింది. అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తారు.



- కొత్త కంపెనీలు.. ఉద్యోగాలు నిల్
- నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి లేదు
- ఏటా జనవరి 1న జాబ్ కేలండర్ విడుదల హామీకి తూట్లు

కూటమి అన్యాయాలపై సమరానికి సిద్ధమైన యువత

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 'యువత పోరు'

మాట తప్పడం మామూలే..

కూటమి పార్టీలు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టాయి. అవి కాకుండా మరో 143 హామీలు అమలు చేస్తామని చెప్పాయి. తీరా మాట తప్పి ప్రజల నమ్మకానికి వెన్నుపోటు పొడిచాయి. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు తమ హామీల అమలుకు ఎంత మొత్తం కావాలో.. అది సాధ్యమో కాదో తెలీదా? సంపద సృష్టిస్తామని కబుర్లు చెప్పిన సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదని చేతులెత్తేశారు. ఆయన మాటలు నమ్మి చేస్తున్న చిన్న ఉద్యోగాలు సైతం వదిలి చాలామంది కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగ నియామకాల పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. జిల్లాలో ఉన్న యువత విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. చేస్తున్న ఉద్యోగాలు మానేయడంతో ఇంటి నుంచి డబ్బులు అడగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యార్థి దీవెన వంటి సంక్షేమ పథకాలకు కూటమి సర్కారు తిలోదకాలు ఇవ్వడంతో విద్యార్థి దశ నుంచే యువతకు కష్టాలు మొదలవుతున్నాయి. అందుకే వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం 'యువత పోరు'కు పిలుపునిచ్చింది.

బదిలీ కౌన్సెలింగ్ బాయ్‌కాట్

- డీఈవో కార్యాలయాన్ని ముట్టడించిన ఎంటీఎస్ టీచర్లు
- గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.39ను పట్టించుకోవట్లేదని ఆవేదన
- సర్వీసంతా ఏజెన్సీలోనే పనిచేయాలనడంపై ఆక్షేపణ
- మైదాన ప్రాంతంలోని ఖాళీల్లో బదిలీ చేయాలని డిమాండ్



డీఈవో కార్యాలయం ముందు బైఠాయించి ప్లకార్డులు చూపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

ఆరిలోవ : విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) కార్యాలయాన్ని మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయులు ఆదివారం ముట్టడించారు. బదిలీ కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేశారు. 1998, 2008 డీఎస్సీల ఎంటీఎస్ ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సెలింగ్ విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఆదివారం నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నారని తెలుసుకున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతాల్లో ఖాళీలు చూపించడం లేదంటూ కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేశారు. వారికి పలు ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. డీఈవో కార్యాలయాన్ని ముట్టడించి, తమకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. డీఈవో కార్యాలయం నుంచి విశాఖ వ్యాలీ స్కూల్ వద్దకు వెళ్తున్న డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌ను చుట్టుముట్టారు. తమకు న్యాయం చేయాలని, మైదాన ప్రాంతంలోని పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యా శాఖాధికారులు బలవంతంగా తమను కొండలపైకి పంపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీవో నంబరు 39 ద్వారా ఎంటీఎస్ ఉపాధ్యాయులకు నివాసముంటున్న ప్రాంతాలకు దగ్గరలో ఉద్యోగం చేసుకునే సౌలభ్యం కల్పించిందన్నారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆయన ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మాట మార్చి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర జీతాలతో ఉన్న తమపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. కౌన్సెలింగ్‌కు ఎవరూ హాజరుకాకపోవడంతో విద్యాశాఖాధికారులు సాయంత్రం వరకు వేచిచూడాల్సి వచ్చింది.

ఖాళీలన్నీ ఏజెన్సీలోనే చూపిస్తున్నారు..



ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీలన్నీ ఏజెన్సీ ప్రాంతంలోనే చూపిస్తున్నారు. ఇప్పటికే రెండేళ్లు కొండలపై ఉద్యోగాలు చేశాం. ఇప్పుడు కూడా కొండ ప్రాంతాలకే బదిలీపై వెళ్లాలి. ఇప్పుడు వెళ్తే రిటైర్‌మెంట్ వరకు అక్కడ పనిచేయాల్సిందే. మాకు వచ్చే జీతం రూ.32 వేలు. ఎలాంటి అలవెన్సులు ఉండవు. అయినా కొండ ప్రాంతాల్లోనే సర్వీసంతా పనిచేయాలంటున్నారు.

–టి.లింగమూర్తి, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుడు

జీవో అమలుచేయాలి



1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుల కోసం 2023లో జీవో నెం.39ను విడుదల చేశారు. దాని ప్రకారం ఎంటీఎస్ ఉపాధ్యాయులను నివాసాలకు దగ్గరగా ఉండేలా బదిలీలు జరగాలి. ఇప్పుడు ఆ జీవో ప్రకారం జరగట్లేదు. ప్రస్తుతం ఖాళీలు ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే అక్కడ రెండేళ్ల పాటు వారంతా ఉద్యోగాలు చేశారు. ఇప్పుడు మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరుతున్నాం. – డి.గోపీనాథ్, పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు

కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ సేవలు బంద్

- మూలనపడ్డ సీపీబీ(కార్డియాలజీ–ఫల్మనరీ బైపాస్) మిషన్
- వైఎస్సార్‌సీపీ హయాంలో నిరంతరాయంగా ఓపెన్ హార్ట్ సర్జరీలు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో గుండె (ఓపెన్ హార్ట్) శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ఈ సర్జరీలు నిర్వహించే పరికరం కార్డియాలజీ ఫల్మనరీ బైపాస్ మిషన్(సీపీబీ) మరమ్మతులకు గురవడంతో.. కొద్ది రోజులుగా ఈ సేవలకు బ్రేక్ పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన వైద్య పరికరాలను ఎప్పటికప్పుడు సమకూర్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కేజీహెచ్‌కు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచీ పేద రోగులు ఎక్కువగా వస్తుంటారు. ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో ఇలాంటి వారికి కేజీహెచ్ పెద్ద దిక్కుగా మారింది. కేజీహెచ్ కార్డియాలజీ విభాగం రెండో అంతస్తులో కార్డియోథోరసిక్ విభాగంలో వైద్యులు ఈ శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీపీబీ మిషన్ తెప్పించి, శస్త్ర చికిత్సలకు ఆటంకం లేకుండా చూశారు. ఓపెన్ హార్ట్ సర్జరీలు, స్టంట్లు, గుండెలో బ్లాక్‌లకు అవసరమైన వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. ఇప్పుడీ సేవలకు అంతరాయం కలగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్జరీ సమయంలో హార్ట్‌కు పంపింగ్ చేసేందుకు సాయపడే ఈ పరికరం లేకపోతే సర్జరీలు చేయడం చాలా కష్టం అని వైద్యులు చెబుతున్నారు.



లింగంపేటలో పొగాకు సాగు

రైతులను ముంచేశారు

వైట్ బర్లీ సాగు చేయండి.. మంచి దిగుబడులు వస్తాయి. గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తాం.. అని రెండు కంపెనీల ప్రతినిధులు నమ్మించి ఉచితంగా పొగాకు నారు ఇచ్చారు. ఇదే ఉత్సాహంతో రైతులు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టి పంట పండించారు. తీరా కొనుగోలు సమయంలో నాణ్యత బాగోలేదని కంపెనీ వారు మెలిక పెట్టి ధర తగ్గించారు. అంతేగాక అరకొరగా కొనుగోలు చేసి పత్తా లేకుండా పోయారు. ఇళ్ల వద్ద మిగిలిన పొగాకు నిల్వ ఉండిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదే అవకాశంగా చేసుకుని దళారులు మధ్య పెట్టి నిలువ దోపిడీ చేస్తున్నారు.

- లాభాలొస్తాయని పొగాకు నారు పంపిణీ
- గొలుగొండ, కొయ్యూరు మండలాల్లో వైట్ బర్లీ సాగు
- అరకొరగా కొనుగోలు చేసిన ఐటీసీ, ఎంఎల్ కంపెనీలు
- మిగిలిన పంట వదిలేసి పలాయనం
- లబోదిబోమంటున్న పొగాకు రైతులు

గొలుగొండ: ఎంతో కష్టపడి పొగాకు సాగు చేశారు. ఏదో లాభం వస్తుందని అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. కష్టపడి పండించిన పంట కొనుగోలు సమయంలో అగ్రిమెంట్ చేసిన కంపెనీలు జాడలేదని గగ్గోలు పెడుతున్నారు. ఇంటి వద్ద ఎండిన పొగాకు నిల్వ ఉండిపోవడంతో దళారులు తక్కువ ధరకు అడుగుతున్నారని వాపోతున్నారు. ఇలా అమ్మకాలు చేస్తే వేలల్లో నష్టం రాక తప్పదని కన్నీరు మున్నీరవుతున్నారు.

రెండు జిల్లాల్లో సాగు

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం, అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో భూములు వైట్ బర్లీ పొగాకు సాగుకు అనుకూలం. పది సంవత్సరాల క్రితం వరకు ఈ రెండు ప్రాంతాల్లో వందలాది మంది రైతులు వైట్ బర్లీ సాగు చేసేవారు. తర్వాత కంపెనీలు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో ఈ సాగు చేయడం మానేశారు. ఈ నేపథ్యంలో గతేడాది, ఈ ఏడాది మరలా ఎంఎల్, ఐటీసీ కంపెనీలు గిట్టుబాటు ధర ఇస్తామని, ప్రతి గ్రామంలో రైతులకు హామీ ఇచ్చాయి. దీనికి వైట్ బర్లీ నారు ముందుగా ఇస్తామని నమ్మించాయి. ఎకరాకు ఏడు వేల వరకు నారు సరఫరా చేశాయి. పంటను తాము ప్రతి గ్రామంలో కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఈ రెండు మండలాల్లో 700 ఎకరాల్లో సాగు చేశారు. వేసవి పొగాకు పేరుతో నీటి సదుపాయం కలిగిన అన్ని ప్రాంతాల్లో రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట పండించారు.



చోద్యం గ్రామ పాకలో ఆరబెట్టిన పొగాకు

కొనుగోలు సమయంలో మెలిక

గొలుగొండ మండలం చోద్యం, లింగంపేట, అమ్మపేట, రామచంద్రపురం, ఏఎల్‌పురం గ్రామాలతోపాటు కొయ్యూరు మండలం కంఠారం, బాలారం, బకులూరు, కన్నంపేట, డేగలపాలేల్లో రైతులు విస్తారంగా పొగాకు సాగు చేశారు. ఈ మేరకు రైతులకు కిలో వైట్ బర్లీకి రూ.140 ఇస్తామని చెప్పిన కంపెనీలు తీరా కొనుగోలు సమయంలో నాణ్యత పేరుతో మెలిక పెట్టాయి. ధరలో కోత విధించి రూ.100 నుంచి రూ.120 వరకు మాత్రమే కొనుగోలు చేశాయి. ఈ ధరకు గత్యంతరం లేక రైతులు తెగనమ్ముకోవాల్సి వచ్చింది. మార్చి వరకు చురుగ్గా పొగాకు కొనుగోలు చేసిన ఐటీసీ కంపెనీ తర్వాత పత్తా లేకుండా పోయింది.

దళారుల భోజ్యం..

పండిన పంటను కంపెనీలు కొనుగోలు చేయకపోవడం వల్ల దళారులు రైతుల శ్రమను దోచుకుంటున్నారు. కొనుగోలు సమయంలో కంపెనీలు పత్తా లేకపోవడంతో ప్రతి రైతు వద్ద వేల కేజీల ఎండిన వైట్ బర్లీ పోగుబడి ఉండిపోయింది. ఇదే అవకాశంగా చేసుకుని దళారులు కిలో రూ.50 నుంచి రూ.60కు కొనుగోలు చేస్తున్నారు. ఇలా తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కంపెనీ కొనుగోలు చేస్తే కనీసం పెట్టుబడైనా వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు రెండు కంపెనీలకు అవసరమైన వైట్ బర్లీని కొనుగోలు చేసుకొని మిగతా పంటను వదిలేశాయని వాపోతున్నారు.

ఇంటి వద్ద పంట నిల్వలు



పండిన పంట ఇంటి వద్ద ఉండిపోయింది. చోద్యంలో ఎకరా భూమిలో వైట్ బర్లీ సాగు చేశాం. పంటకు రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టాం. చోద్యంలో మార్చి వరకు 400 కేజీల వరకు అమ్మకాలు చేశాం. ఇప్పుడు మరో 500 కేజీల ఎండిన వైట్ బర్లీ పంట ఇంటి వద్ద ఉండిపోయింది. కొనుగోలు చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాను. – కె.నూకరాజునాయుడు, రైతు, చోద్యం

చాలా వరకు కొనుగోలు చేశాం

గ్రామాల్లో రైతులకు ఇచ్చిన అగ్రిమెంట్ మేరకు చాలా వరకు వైట్ బర్లీ పంటను ఐటీసీ కంపెనీ కొనుగోలు చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ కొనుగోలు చేస్తున్నాం. ఐటీసీ కంపెనీ ద్వారా పండించిన పంటను పై అధికారుల ద్వారా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. –వరహాలబాబు, గొలుగొండ ఐటీసీ సూపర్‌వైజర్



కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఇంటి వద్ద ఉండిపోయిన పొగాకు బేళ్లు

మోకాళ్లపై ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరసన దీక్ష శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకొని.. మోకాళ్లపై నిలుచొని నిరసన తెలియజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో త్వరలోనే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి కరక మహేష్, ఉపాధ్యక్షుడు యర్రా ప్రకాష్, కోశాధికారి లాలం నాగేంద్ర పాల్గొన్నారు.

పర్యాటకుల తాకిడి

కొమ్మాది: ప్రముఖ పర్యాటక బీచ్‌లన్నీ ఆదివారం పర్యాటకుల తాకిడితో సందడిగా మారాయి. వేసవి సెలవులు, వారాంతం కావడంతో ఉదయం నుంచే పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భీమిలి బీచ్, ఎర్రమట్టిదిబ్బలు, కోకోనట్ ఎరీనా బీచ్, రామాద్రి బీచ్, తొట్లకొండ, బావికొండ, రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాలన్నీ పర్యాటకుల కోలాహలంతో నిండిపోయాయి.

శంకరంలో బంగారం చోరీ


శంకరం గ్రామంలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం

అనకాపల్లి టౌన్: తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగిన సంఘటన మండలంలోని శంకరం గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నివాసముంటున్న శరగడం ఆదినారాయణ ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో అనకాపల్లి వెళ్లారు. అనంతరం అదే రోజు తొమ్మిది గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉన్న బ్యాగుల్లో సామాన్లు చిందరవందరంగా ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం చోరీ జరిగినట్టు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం క్లూస్ టీం సిబ్బంది వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి 0అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.


పీఆర్ఎస్ఐ కార్యవర్గంలో విశాఖకు కీలక పదవులు


పీఆర్ఎస్ఐకి ఎన్నికైన కొత్త కార్యవర్గం

మహారాణిపేట: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) జాతీయ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో విశాఖకు చెందిన ఇద్దరు ప్రముఖులకు స్థానం లభించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో శనివారం వివిధ రాష్ట్రాల నుంచి పీఆర్ఎస్ఐ ప్రతినిధులు హాజరై ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ అజిత్ పాథక్ ఎన్నిక కాగా, విశాఖకు చెందిన స్వచ్ఛ భారత్ నిపుణుడు, రోటరీ జిల్లా–3020 మాజీ కార్యదర్శి, రోటరీ బ్లడ్ సెంటర్ మాజీ కార్యదర్శి, పీఆర్ఎస్ఐ విశాఖ శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి వరుసగా రెండవసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే కోరమాండల్ సంస్థ మీడియా సలహాదారు, హెచ్.పి.సి.ఎల్. మాజీ అధికారి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు యు.ఎస్.శర్మను దక్షిణాది రాష్ట్రాలకు పీఆర్ఎస్ఐ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే 2025–2027 కాలానికి పలువురు కార్యనిర్వాహక సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన నాయకత్వ బృందం పీఆర్ఎస్ఐ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తుందని,, పబ్లిక్ రిలేషన్స్ మెరుగుదలకు, వృత్తిపరమైన అభివృద్ధికి కృషిచేయడానికి, సభ్యుల మధ్య నెట్‌వర్కింగ్‌ను ప్రోత్సహించడం వంటి పనులను కొనసాగించడానికి కృషి చేస్తుందని జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి పేర్కొన్నారు. పీఆర్ఎస్ఐ జాతీయ కార్యవర్గాన్ని విశాఖ శాఖ అధ్యక్షుడు ఎం.కె.వి.ఎల్.నరసింహం, కార్యదర్శి ఎ.గోవిందరావు, కోశాధికారి ఎస్.వి.నరసింహం, ఉపాధ్యక్షుడు, స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ (పీఆర్) ఆర్.పి.శర్మ, శంకర ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పబ్లిక్ రిలేషన్స్ కె.బంగారు రాజు, విశాఖ శాఖ పూర్వ అధ్యక్షుడు కె.రామారావు తదితరులు అభినందించారు.

చివరికి నీరందేనా?

- తుప్పలు,డొంకలతో నిండిన రైవాడ కాలువలు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పూడిక తొలగించని అధికారులు
- శివారు ఆయకట్టుకు నీరందని పరిస్థితి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


పుష్కలంగా నీటి నిల్వలతో కళకళలాడుతున్న రైవాడ జలాశయం


చేనులపాలెం వద్ద పూడుకుపోయిన పంట కాలువ


డ్రైనేజీని తలపిస్తున్న కాశీపురం, చిననందిపల్లి గ్రామాలకు సాగునీరందించే పంట కాలువ


పెదనందిపల్లి వద్ద తుప్పలు, డొంకలతో నిండిపోయిన రైవాడ జలాశయం పంట కాలువ

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నా శివారు ఆయకట్టుకు సాగు నీరందని పరిస్థితి దాపురించింది. జలాశయం నుంచి ఆయకట్టుకు నీరందించే పంట కాలువలు పిచ్చి మొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. జలాశయం కుడి, ఎడమ ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువలు సైతం తుప్పలు, డొంకలు, పూడికతో నిండిపోయాయి. దీంతో ఈ ఏడాది చివరి ఆయకట్టుకు సాగు నీరు ప్రశ్నార్థకంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే జలాశయం పరిధిలోని సాగు నీటి కాలువల్లో పూడిక తీత, తుప్పలు తొలగింపు, మరమ్మతులు తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. జలాశయం మట్టి గట్టు పటిష్టతతో పాటు కుడి, ఎడమ హెడ్ స్లూయిస్ అడుగు భాగంలో ఇనుప గేట్ల మరమ్మతులు, కుడి, ఎడమ కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ పనులకు రూ. 3 కోట్లు మంజూరయ్యాయి. గ్రావెల్‌తో జలాశయం గట్టు పటిష్టం చేసే పనులు చేపట్టిన అధికారులు కాలువల్లో తుప్పలు, డొంకలు, పూడికలు తొలగించే పనులు చేపట్టడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నారుమడుల తయారీలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఎటువంటి పెట్టుబడి సహాయం అందించక పోయినప్పటికీ అప్పులు చేసి మరీ ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారనుంది. జిల్లాలోనే వేలాది ఎకరాలకు సాగునీరు **అందిస్తూ** అన్నపూర్ణగా **నిలిచిన** రైవాడ జలాశయం పై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి పట్ల అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జలాశయం ఆయకట్టు వివరాలిలా...

రైవాడ జలాశయం దిగువన దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం మండలాలకు చెందిన 15,344 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 10 వేల మందికి పైబడి జలాశయం నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. జలాశయం నుంచి పంట పొలాలకు నీరందించేందుకు 15.30 కిలోమీటర్ల ఎడమ కాలువ, 12.30 కిలోమీటర్ల పొడవున కుడి కాలువతో పాటు తొమ్మిది పిల్ల కాలువలు ఉన్నాయి. జలాశయంపై ఆధారపడిన చెరువులు 60 వరకు ఉన్నాయి. వేసవిలో సైతం వర్షాలు పడటంతో జలాశయంలో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. పుష్కలంగా నీరు ఉన్నా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టక పోవడంతో తమ పొలాలకు సాగు నీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 111 మీటర్లు ఉంది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటి నిల్వలతో ఖరీఫ్ సాగుకు డోకా ఉండబోదని ఇరిగేషన్ అధికార్లు చెబుతున్నారు. పంట కాలువలు తుప్పలు, డొంకలతో పూడిక పోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కాలువల్లో తుప్పలు, పూడిక తొలగించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పూడిక తొలగించాలి



ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పంట కాలువల్లో పూడికలు, తుప్పలు, డొంకలు తొలగించడం ఆనవాయితీ. పూడికలు తొలగించక పోతే ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందే పరిస్థితీ ఉండదు. ఫలితంగా ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికార్లు స్పందించి ప్రధాన పంట కాలువలు, పిల్ల కాలువల్లో పూడికతీతకు చర్యలు చేపట్టాలి.

–అన్నం వెంకటరావు, రైతు, బోయిలకింతాడ

త్వరలో పనులు ప్రారంభిస్తాం



రైవాడ జలాశయం అభివృద్ధికి రూ. 3 కోట్లు మంజూరయ్యాయి. గ్రావెల్‌తో జలాశయం గట్టు పటిష్టం చేశాం. కుడి, ఎడమ ప్రధాన పంట కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడికలు తొలగింపునకు, ఇంటిక్ చాంబర్ మరమ్మతు పనులకు అగ్రిమెంట్ పూర్తయ్యింది. పనులను వారంలోగా ప్రారంభిస్తాం. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తాం. పిల్ల కాలువల్లో తుప్పలు, పూడికలు తొలగించే పనులు ఆయా నీటి సంఘాలకు అప్పగించాం. తక్షణమే పనులు చేపట్టాలని సూచించాం.

–జి. సత్యంనాయుడు, డీఈ, రైవాడ జలాశయం

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 180 మంది హాజరు

అనకాపల్లి టౌన్: మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో రెండవరోజు ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 180 మంది విద్యార్థులు హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. 113 మంది బాలురు, 67 మంది బాలికలు హాజరయ్యారన్నారు. సోమవారం 32,001నుంచి 50,000 ర్యాంక్ వరకు ధ్రువీకరణపత్రాల పరిశీలన **జరుగుతుందని ఆయన తెలిపారు.**

మరణించి.. మరో ఇద్దరికి వెలుగునిచ్చి..

పెందుర్తిలో మృతి చెందిన వ్యక్తి నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు




నగేష్ కళ్లు తీసుకునేందుకు అంగీకారం తెలుపుతున్న నగేష్ భార్య హిమబిందు (ఇన్‌సెట్) నగేష్ (ఫైల్)

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన వ్యక్తి నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకుంది ఓ కుటుంబం. పెందుర్తి సాయినగర్‌కు చెందిన రాపేటి నగేష్(45) ఆరోగ్యం క్షీణించి శనివారం రాత్రి మృతి చెందారు. ఈ నేపథ్యంలో స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్, **స్థానిక పెద్దలు శరగడం మధు, పెంటకోట రమణ** అక్కడకు వెళ్లి నగేష్ కళ్లు దానం చేస్తే మరో ఇద్దరికి కంటి చూపు ఇచ్చినవారు అవుతారని కుటుంబ సభ్యులను ఒప్పించారు. వెంటనే భర్త నేత్రాలు దానం ఇచ్చేందుకు నగేష్ భార్య హిమబిందు అంగీకరిస్తూ సంతకం చేశారు. అక్కడకు చేరుకున్న ఎల్వీ ప్రసాద్ సారథ్యంలోని మోషన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు నగేష్ నేత్రాలను సేకరించి సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు. పుట్టెడు దుఃఖంలోనూ నగేష్ కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చూపిన **తీరుపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తాయి.**

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ

కొమ్మాది(విశాఖ): సాగరనగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం 'హరే కృష్ణ, హరే రామ' నామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజలను పురస్కరించుకుని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైజాగ్‌లో వండర్ పార్క్

విజ్ఞానం, వినోదం పంచే బయోడైవర్సిటీ పార్క్ • తెలుగు రాష్ట్రాల బయాలజీ విద్యార్థుల సందర్శన


పార్కులో పెంచుతున్న అరుదైన మొక్కలు

నగర జీవితంలోని కాంక్రీట్ జంగిల్‌కు భిన్నంగా, స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో సేదతీరాలని ఉందా? అరుదైన మొక్కల గురించి తెలుసుకుంటూ, వాటి అందాలను ఆస్వాదించాలనుకుంటున్నారా? అయితే మీరు కచ్చితంగా పెద వాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించాలి. రాణి చంద్రమణి దేవి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఈ ఉద్యానవనం.. ఎన్నో వింతలు, విశేషాలతో ప్రకృతి ప్రియులను, విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

- బీచ్‌రోడ్డు

ప్రకృతి అద్భుతాలకు చిరునామా



ఈ పార్క్ కేవలం చెట్ల సమాహారం కాదు.. జీవవైవిధ్యానికి ఓ నిలువుటద్దం. అంతరించి పోతున్న జాతుల నుంచి విదేశీ వింతల వరకు ఇక్కడ కొలువుదీరిన ప్రతీ మొక్కకూ ఓ ప్రత్యేక కథ ఉంది. పార్క్ సమన్వయకర్త డాక్టర్ ఎం.రామమూర్తి పర్యవేక్షణలో ఈ మొక్కల విశిష్టతలను విద్యార్థులకు, సందర్శకులకు వివరిస్తుండటం ఇక్కడి అదనపు ఆకర్షణ. ఈ పార్కులోని కొన్ని మొక్కల గురించి తెలుసుకుందామా?

ప్రేమను పంచే మొక్కలు



ప్రేమకు గుర్తు గులాబీ పువ్వు మాత్రమే కాదు. అనేక అరుదైన మొక్కలు, వాటి పువ్వులు, ఆకులు కూడా ఉన్నాయి. బయోడైవర్సిటీ పార్కులో ఇటువంటి ప్రత్యేకమైన మొక్కలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా ప్రేమికులు తమ ప్రేమకు గుర్తుగా చెట్లపై పేర్లు రాస్తుంటారు. అయితే చాలామందికి తెలియని విషయం ఏమిటంటే.. 'వాలెంటైన్స్ ప్లాంట్' అనే ఒక మొక్క ఉంది. ఈ మొక్క ఆకులు చాలా మందంగా ఉండటం వల్ల వాటిపై పేర్లు రాసుకోవచ్చు. ఇలా రాసిన పేర్లు ఎప్పటికీ చెరిగిపోవు. అలాగే 'వాలెంటైన్స్ హార్ట్' అనే మరో అరుదైన మొక్క కూడా ఈ పార్కులో ఉంది. ఎడారి ప్రాంతాల్లో కనిపించే ఈ మొక్క చూడటానికి లవ్ సింబల్ ఆకారంలో ఉంటుంది. ఈ ప్రత్యేకత ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ మొక్కను 'స్వీట్ హార్ట్' అని కూడా పిలుస్తారు. ఇంకా 'మిలియన్స్ హార్ట్స్' మొక్క పార్కుకు వచ్చే యువతీ యువకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఒకే మొక్కకు వందల సంఖ్యలో గుండె ఆకారపు ఆకులు ఉండటం దీని ప్రత్యేకత. ఇది చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉండటంతోనే దీనికి 'మిలియన్స్ హార్ట్స్' అనే పేరు వచ్చింది.

షేవింగ్ బ్రష్ ట్రీ





పేరుకు తగ్గట్టే దీని పువ్వులు అచ్చం షేవింగ్ బ్రష్‌ను పోలి ఉంటాయి. ఇది ఒక ఎడారి మొక్క. చూడటానికి ఆకర్షణీయంగా ఉంటుంది. దీని పూల కేశాలు సన్నటి తీగల్లా ఉంటాయి. లావుగా ఉండే దీని కాండం నీటిని నిల్వ చేసుకుంటుంది. వేసవిలో నీటి కొరత ఏర్పడినప్పుడు, ఆ నీటినే వాడుకుని జీవిస్తుంది. ప్రకృతి ఎంత గొప్ప ఇంజినీరో చెప్పడానికి ఈ మొక్క ఒక ఉదాహరణ.

కొండగోగు

అంతరించిపోతున్న మొక్కల్లో ఇదొకటిగా చెబుతారు. ఈ మొక్క చూడటానికి ఎంతో అందంగా ఉంటుంది. దీని పచ్చి కొమ్మలకు మంటపెడితే భగ్గున మండుతాయి. పక్షులు, తేనెటీగలు, సీతాకోకచిలుకలను అధికంగా ఆకర్షించే దీని పువ్వులు కప్పు ఆకారంలో ఉండటం మరో విశేషం.

కృత్రిమ హౌస్‌లో ఆర్కిడ్ల సోయగం



ప్రపంచంలోనే అత్యంత అందమైన పూల జాతుల్లో ఆర్కిడ్‌లు ఒకటి. వీటికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అలాంటి అద్భుతమైన మొక్కలు జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. 'ఈ మొక్కలు సాధారణంగా చల్లని ప్రాంతాల్లో పెరుగుతాయి. ఇవి మట్టిలో కాకుండా చెట్ల కాండాన్ని అల్లుకుని పెరుగుతూ, గాలిలోని తేమను పీల్చుకుంటూ జీవిస్తాయి. ముఖ్యంగా వేసవి కాలంలో ఇవి అధికంగా పుష్పిస్తాయి. ఆర్కిడ్‌ల ఆకారాలు, రంగులు విభిన్నంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. ఆర్కిడ్‌లు జీవించడానికి చల్లని వాతావరణం అవసరం.' అని సమన్వయకర్త రామ్మూర్తి తెలిపారు. అందుకే జీవ వైవిధ్య ఉద్యానవనంలో ప్రత్యేకంగా ఒక కృత్రిమ ఆర్కిడ్ హౌస్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ తొట్టెల్లో బొగ్గు, కొబ్బరి పీచులను ఉపయోగించి మొక్కలను సంరక్షిస్తున్నారు. డ్యాన్సింగ్ లేడీ, ఎరైడ్స్ మల్టీఫ్లోర, డెండ్రోబియం ఎఫిల్లా, సింబిడియం వంటి అనేక రకాల ఆర్కిడ్ మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. వాటికి పూసే పువ్వులు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. మన దేశంలో మేఘాలయ, సిమ్లా ప్రాంతాల్లో ఇవి అధికంగా కనిపిస్తాయి.


పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులకు ప్రయోగశాల

ఈ బయోడైవర్సిటీ పార్క్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని బయాలజీ విద్యార్థులకు ఒక సజీవ ప్రయోగశాలగా మారింది. తమ పరిశోధనలు, ప్రాజెక్టుల కోసం విద్యార్థులు తరచూ ఇక్కడికి వస్తుంటారు. డాక్టర్ రామమూర్తి వారికి మొక్కల చరిత్ర, వాటి పెంపకం, వైద్య, పర్యావరణ ప్రయోజనాలను వివరిస్తూ వారిలో ప్రకృతిపై ఆసక్తిని పెంచుతున్నారు.

క్లుప్తంగా

దశావతారాల విగ్రహాల ఏర్పాటుకు విరాళాలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలకు పలువురు దాతలు రూ.60 వేలు విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి మునగపాక బాబూరావు, మిత్రులు సుకవాసి నారాయణరావు, బార్ల గౌరీ చంద్రశేఖర్, అడ్డూరి రామప్రసాద్ కలిసి రూ.30,116 అందజేశారు. కొల్లూరు నరసింగరావు, ఆనాల తాతయ్యనాయుడు, మజ్జి వెంకటరమణలు ఒక్కొక్కరూ రూ.10116 చొప్పున అందజేశారని ఆలయ కమిటీ ప్రతినిధులు మజ్జి ఫణీష్, కోన సురేష్ తెలిపారు.

వాకర్స్ అండ్ వాకర్స్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్ అండ్ వాకర్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షులుగా రాజాన అప్పారావు, ఎడ్ల త్రినాథ్, అధ్యక్షునిగా పెతకంశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా ఎడ్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బుద్ద నాయుడు, కోశాధికారిగా పాలమరశెట్టి ఓం నమఃశివాయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నూతన కార్యవర్గం పదవీ కాలం రెండేళ్లపాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్ సభ్యులు మునుకూరి రామకృష్ణ, కోలాటి నవీన్‌కుమార్, వేగి రాము, ఎవీ బ్రహ్మనందం, రెడ్డి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా శిథిల బ్రిడ్జి



మునగపాకలో ప్రమాదకరంగా బ్రిడ్జి

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో బ్రిడ్జి శిథిల స్థితికి చేరి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మునగపాక మెయిన్‌రోడ్డు నుంచి గ్రామంలోకి వచ్చేందుకు వీలుగా గతంలో సాగునీటి కాలువపై బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం ఈ బ్రిడ్జి మీదుగా వందలాదిగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జి అడుగుభాగం పెచ్చులూడిపోయింది. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ఏఎస్‌ఐ దొర తెలిపారు. మునగపాక మెయిన్‌రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్‌ఐ హెచ్చరించారు. వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: డ్రాగాన్
సత్యనారాయణ స్క్రీన్-2	:8 వసంతాలు
పర్తిసాయి	:కుబేరా
షిర్డీసాయి	: సితార జమీన్ పర్
వెంకటేశ్వర	:పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 13 యూనిట్లు, బి పాజిటివ్ -14 యూనిట్లు, ఒ పాజిటివ్ -14 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(ఫోన్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 238 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

రైల్వే ఫ్లైఓవర్‌కు మోక్షమెప్పుడు ?



నరసింగబిల్లి వద్ద రైల్వే గేటు మూసి ఉండడంతో నిరీక్షిస్తున్న వాహన చోదకులు

నిత్యం వందలాది రైళ్ల రాకపోకలు..గంటల కొద్దీ గేటు మూసివేత.. ఫలితంగా ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని నాలుగు మండలాల ప్రయాణికులు ఏళ్ల తరబడి వేడుకుంటున్నారు. వంతెన మంజూరైందని చెబుతున్నారు తప్ప ఎప్పుడు నిర్మిస్తారో తెలియడం లేదు.

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ లేక ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లకు గురతున్నారు. ప్రధానంగా నాలుగు మండలాలకు చెందిన ప్రయాణికులు ఈ గేటు దాటి నిత్యం రాకపోకలు సాగిస్తారు. ప్రధాన మార్గం కావడంతో రైళ్ల రాకపోకల రద్దీతో తరచూ గేటు మూతపడి ఉంటోంది. దీంతో గమ్యస్థానాలకు సకాలంలో చేరలేకపోతున్నామని ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు. విశాఖ- విజయవాడల మధ్య ఉన్న రైలు మార్గంలో నరసింగబిల్లి స్టేషన్ వద్ద గేటు ఉంది. ఈ గేటు మీదుగా నరసింగబిల్లి నుంచి అచ్యుతాపురం మండలం కొండకర్ల వరకు రోడ్లు, భవనాల శాఖకు చెందిన రోడ్డు ఉంది. ఈ మార్గం మీదుగా రోజుకు ఒక వైపు యలమంచిలి, కశింకోట, మరో వైపు మునగపాక, అచ్యుతాపురం మండలాలకు చెందిన గ్రామస్తులు, వాహన చోదకులు రాకపోకలు సాగిస్తారు. భారీ వాహనాలు కూడా అధికంగా తిరుగుతాయి. యలయంచిలి, కశింకోట మండలాల గ్రామాల నుంచి మునగపాక,అచ్యుతాపురం మండలాల గ్రామాలకు రాకపోకలు సాగించడానికి ఇది దగ్గర దారి. అచ్యుతాపురంలోని బ్రాండిక్స్, ఇతర పరిశ్రమలకు ఉద్యోగులు బస్సులు, ద్విచక్ర వాహనాలపై ఈ మార్గంలో ఎక్కువగా ప్రయాణిస్తారు. అయితే విశాఖ-విజయవాడ మధ్య ప్రధానమైన రైలు మార్గం కావడంతో రోజుకు 200 పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి.దీనివల్ల ఒక్కో రైలు దాటేటప్పుడు గేటు మూత పడుతుంది. ఒక్కోసారి రెండు, మూడు రైళ్లు ప్రయాణిస్తే చాలా ఎక్కువ సేపు గేటు మూత పడుతుంది. దీంతో గమ్యస్థానాలకు సకాలంలో చేరలే కపోతున్నామని వాహన చోదకులు, విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు తరలించడంలో జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ డబుల్ లైన్‌తో రెండేళ్ల క్రితం వంతెన మంజూరైనట్టు రైల్వే అధికారులంటున్నారు. గేటుకు రెండు వైపులా అర కిలో మీటరుపొడవునా అప్రోచ్ రోడ్లు వేయడానికి ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులు భూములు కూడా సేకరించి, పరిహారం చెల్లింపునకు నివేదించారు. ఇది జరిగి దాదాపు రెండేళ్లు కావస్తోంది. అయితే ఇంకా వంతెన నిర్మాణం మాత్రం చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని మంజూరైన వంతెన నిర్మాణాన్ని సత్వరమే చేపట్టి తమ కష్టాలు తీర్చాలని ఈ ప్రాంత ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.



గేటు తెరవడంతో వస్తున్న వాహనాలు

గమ్యస్థానాలకు సకాలంలో చేరలేక పోతున్నాం



నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ వంతెన లేక ఇబ్బంది పడుతున్నాం. యలమంచిలి, అనకాపల్లి వంటి ప్రాంతాలకు ఈ గేటు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాం. రైళ్లు వచ్చినప్పుడు గేటు ఎక్కువ సమయం మూసి ఉండటం వల్ల గమ్యస్థానాలకు సకాలంలో చేరలేక ఇక్కట్లకు గురవుతున్నాం.

–మారిశెట్టి రమణ, గణపర్తి,మునగపాక మండలం

ఫ్లై ఓవర్ నిర్మించాలి



నరసింగబిల్లి రైలు గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెన లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. నరసింగబిల్లి నుంచి అచ్యుతాపురం ఎస్‌ఈ జెడ్ పరిశ్రమలకు రాకపోకలు సాగించడానికి ఇది దగ్గర మార్గం. కశింకోట, మునగపాక, అచ్యుతాపురం మండలాల్లోని గ్రామాలకు కూడా రాకపోకలు సాగించడానికి ఇదే మార్గం. అయితే నరసింగబిల్లి రైల్వే గేటు తరచుగా మూసి ఉండటం వల్ల సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నాం. దీనిదృష్ట్యా గేటు వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కోన నాగేశ్వరరావు, నరసింగబిల్లి

నిర్మాణానికి పరిశీలన జరిపాం

నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణానికి ఎలైన్‌మెంట్‌ను, ఇతర అంశాలపై ఇటీవల రైల్వే, రెవెన్యూ అధికారులతోపాటు కలిసి పరిశీలించాం. వంతెన నిర్మాణ వ్యయం నిర్ణయిస్తారు. రైల్వేగాని, రోడ్లు భవనాల శాఖగాని, రెండు కలిసి గాని ఫ్లైఓవర్ నిర్మించే అవకాశం ఉంది. దీనిపై స్పష్టత రావలసి ఉంది.

–పద్మిని, జేఈ, రోడ్లు, భవనాల శాఖ, అచ్యుతాపురం

ప్రజాధనం దుర్వినియోగం

- యోగా డేతో ప్రయోజనం శూన్యం
- ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ



దేవరాపల్లి : యోగా డే పేరిట కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం అత్యంత దారుణమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్న పాలకులు భారీగా ఖర్చుచేసి పెద్ద ఎత్తున యోగా డేను నిర్వహించడం వల్ల ప్రజలకు ఒరిగిందేమిటని ఆయన ప్రశ్నించారు. కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే, గిన్నిస్ బుక్ రికార్డుల కోసం కోట్లాది రూపాయాలు వెచ్చించడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలు వదిలి ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు యోగా డే ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో సుమారు నెల రోజులుగా పాలన స్తంభించిపోయిందన్నారు. బస్సులు సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారన్నారు. యోగా పట్ల సానుకూల దృక్పథం ఉంటే ప్రతి స్కూల్‌లో యోగా టీచర్‌ను నియమించి యోగా శిక్షణ ఇప్పించాలని రమణ సూచించారు.

ఘనంగా వాక మరిడమ్మ పండగ



మొక్కులు చెల్లించుకునేందుకు ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో ఆదివారం వాక మరిడమ్మ అమ్మవారి పండగను గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులతో పాటు గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. ప్రతి ఏడాది ఉపాధి వేతనదారులతో అమ్మవారి పండగను వీఆర్పీ ఆర్.వెంకటలక్ష్మి జరుపుతున్నారు.

గ్రామంలో గల సతకం పట్టు నుంచి ఊరేగింపుగా ప్రజలు, ఉపాధి వేతనదారులు వెళ్లి అడ్డూరి కొండ వాగు సమీపంలో గల వాక మరిడమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఉపాధిహామీ మేట్‌లు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు సఖి సేవా సమితి వితరణ



ఆశ్రమ పాఠశాలలో సఖి సేవా సమితి సంస్థ సభ్యులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలకు విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన శ్రీసఖి సేవా సమితి సభ్యులు నోటు పుస్తకాలు, నిత్యావసర సరకులు ఆదివారం అందజేశారు. సంవత్సరానికి సరిపడా నోటు పుస్తకాలు, బోధన పరికరాలు, చాపలు, 25 రైస్ బ్యాగ్‌లు, ఒక నెలకు సరిపడా నిత్యావసర సరకులు, సుమారు రూ.2 లక్షల విలువ గల స్టేషనరీని ఆశ్రమ పాఠశాల కరస్పాండెంట్ పి.ఎస్.టి. పట్నాయక్‌కు అందించారు. గత 20 సంవత్సరాలుగా పాఠశాలకు తమ సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీసఖి సేవా సమితి సభ్యురాలు బిందు రాణికి పాఠశాల సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో అతిథులు, కోచ్ వెంకట్‌తో క్రీడాకారులు

అచ్యుతాపురం రూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని స్థానిక వైద్యులు జగదీశ్, సుధీర్ అన్నారు. ఆదివారం భోగాపురం క్రీడా ప్రాంగణంలో వీఆర్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం కోచ్ వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సుమారు 80 మంది క్రీడాకారులకు రగ్బీ క్రీడపై నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం కనబరిస్తే విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు పతకాలు, బహుమతులు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహక ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

105 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక తులసీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్, యలమంచిలి తులసి ఆప్టికల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 105 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 37 మందికి కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్యురాలు అరుణ, ప్రతినిధులు ఎం.అరుణ్‌కుమార్, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

అరబుపాలెంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు



అరబుపాలెంలో పైప్‌లైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో పాడైన పైప్‌లైన్‌కు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



గోతులమయంగా మూల స్వయంభూవరం రోడ్డు

పరవాడ: మండలంలోని రోడ్లు మరమ్మతులకు గురై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామానికి వెళ్లే రహదారి మరింత దారుణంగా ఉంది. పదేళ్లుగా రోడ్డు మరమ్మతులకు నోచుకోక నిత్యం అష్టకష్టాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండున్నర కిలోమీటర్ల రహదారిలో రాళ్లు తేలిపోయి, మోకాలి లోతు గోతులతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రాత్రి వేళ రహదారిలో రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోందన్నారు. వీధి దీపాలు లేక కటిక చీకటిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. ఈ రోడ్లను త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాళాలు పగలగొట్టి.. బంగారు నగలు చోరీ

లంకెలపాలెంలో ఘటన..
ఆరున్నర తులాల అపహరణ



తెరిచి ఉన్న బీరువా తలుపులు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

పరవాడ: లంకెలపాలెం రామాలయం వీధికి చెందిన సూరిశెట్టి వెంకటలక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. బీరువాలో భద్రపర్చిన ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు వెంకటలక్ష్మి ఆదివారం పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

రామాలంయం వీధిలో నివసిస్తున్న వెంకటలక్ష్మి తన పెద్ద కుమార్తెతో కలిసి శనివారం ఉదయం పెందుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం తన ఇంటి డోర్ తెరిచి ఉన్నట్లు పొరుగువాళ్లు అందించిన సమాచారం మేరకు ఇంటికి చేరుకుంది. మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి, బెడ్‌రూమ్‌లోని సెల్ఫ్‌లో దాచిన తాళాలను తీసి, బీరువా తెరిచి, లాకర్లోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరవాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. చోరీ కేసును అనుమానస్పద కేసుగా నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

ముళ్ల పొదలతో రోడ్డు.. శిథిలావస్థలో వంతెన



రహదారిలో మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్న వంతెన



దలాయిపాలెం రోడ్డులో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి శివారు పోలిపల్లి కూడలి-కలపాక రహదారిలో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలతో రహదారి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిలో హిందూజా, ఎన్టీపీసీ, ఫార్మాసిటీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, రోజువారీ కూలీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పొడవునా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు కళ్లకు తగలడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకటి పడితే రోడ్డు పక్కనున్న ముళ్ల కంచెలు వాహనచోదకులకు కనిపించడం లేదు. రహదారిలో వీధి దీపాలు లేని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దీంతోపాటు దలాయిపాలెం ఉప్పుటేరుపై నిర్మించిన వంతెన మరమ్మతుల కోసం ఎదురుచూస్తోంది. వంతెనపై ఇరువైపుల ఏర్పాటు చేసిన రెయిలింగ్ శిథిలావస్థకు చేరి ముక్కలుగా పడిపోతోంది. రహదారిలో తుప్పలను తొలగించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా బండిమాంబ పండగ

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో కొలువైన బండిమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్,తులసి దంపతులు దర్శించుకుని, పూజలు చేశారు. వారితో పాటు గ్రామ ఉప సర్పంచ్ సిరపరపు వాసు, వార్డ్ సభ్యులు గురి నాగమణి, పార్టీ నాయకులు యడ్ల నాయుడు, దేముడు బాబు, గురి భరత్, తేజ అమ్మవారిని దర్శించుకున్నారు.

తీరంలో సందర్శకుల సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: మండలంలోనితిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కళకళలాడాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి బీచ్‌కు సందర్శకులు తరలివచ్చారు. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండటంతో తీరంలోని ఇసుక తిన్నెలపై క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారులు తీరంలో తడి ఇసుకతో వివిధ ఆకృతులను నిర్మించుకుంటూ ఆనందంగా గడిపారు. సాయంత్రం వరకు కెరటాలతో సయ్యాటలాడుతూ, చీకట్లు చుట్టుముడుతున్న వేళ ఇళ్లకు తిరుగుముఖం పట్టారు.